
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
శనివారం 24 ఫిబ్రవరి 2024



అంజన్న పైసలేవీ..? ఖాతాకు చేరని టెండర్ సొమ్ములు 7లో..
పథకాల అమలులో అలసత్వం ప్రదర్శించొద్దు 8లో..

తనివితీరా పూజలు..



గొల్లపల్లిలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



ధర్మపురిలో తల్లుల గద్దెల వద్ద కిక్కిరిసిన జనం



ధర్మపురిలో అమ్మవారలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



పొలాసలో భక్తుల మొక్కులు

వనదేవతలకు మొక్కు చెల్లింపులు

కిట కిటలాడిన జాతర మైదానం

సమ్మక్క-సారలమ్మను కొలిచిన భక్తులు

ధర్మపురి, ఫిబ్రవరి 23: అమ్మలారా సల్లంగ చూడు తల్లీ.. అంటూ వనదేవతలకు భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెలపై కొలువుదీరిన తల్లులను దర్శించుకుని తనివితీరా మనసులో స్మరించుకున్నారు. ధర్మపురి గోదావరి నదీ తీరాన జరిగే శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలకు శుక్రవారం భారీగా భక్తులు తరలివచ్చారు. జగిత్యాల, మంచిర్యాల, నిర్మల్, పెద్ద పల్లి జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తులతో జాతరా మైదానం కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు సమీపంలో గల గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అమ్మవారలను కొలుస్తూ భక్తి పాటలు పాడుతూ గద్దెల వద్దకు చేరుకున్నారు. సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అనేక మంది భక్తులు అమ్మవారల గద్దెల చుట్టు ప్రదక్షిణాలు చేసి కొబ్బెరికాయలు కొట్టి పసుపు, కుంకుమలతో పూజలు చేసి ఒడి బియ్యం సమర్పించారు. అమ్మవారలకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. పగిడిద్దరాజు, నాగులమ్మ దేవతలను కూడ దర్శనం చేసుకున్నారు. అనేక మంది భక్తులు పూజారి బైర బోయిన వెంకటయ్య నుంచి ఆశీర్వాదం పొందారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించి భక్తులకు సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఒల్లెపు శంకర్ రాజు, ఉపాధ్యక్షులు అల కొండ చంద్రయ్య, ఎస్‌పీసీ విద్యార్థులు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్యమ్మ, జడ్పీటీసీ బత్తిని అరుణ, బుగ్గారం జడ్పీటీసీ బాదినేని రాజేందర్, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ గంగాధర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలు జక్కు పద్మ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



అమ్మవార్లకు పూజలు చేస్తున్న విప్ అడ్లూరి

అమ్మవార్ల దయతోనే నాకు పునర్జన్మ..

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్

ఎండపల్లి : అమ్మవార్ల దయతోనే నాకు పునర్జన్మ వచ్చిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి వెళ్తుండగా మండలంలోని రాజారాంపల్లి గ్రామంలోని వనదేవతలను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ కభ్యులు, పార్టీ కార్యకర్తలు ఒగ్గు కళాకారులతో స్వాగతం పలికారు. వన దేవతలకు బంగారం(బెల్లం) పంచిపెట్టారు. అనంతరం అమ్మవార్ల వద్ద కోయ పూజారులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్‌రెడ్డి, ఏలేటి శైలెందర్ రెడ్డి, మద్దుల గోపాల్‌రెడ్డి, గాజుల విజయ్, సొంశెట్టి రమేష్, పాల్గొన్నారు.

పెగడపల్లి :పెగడపల్లి మండలంలో మూడవ రోజైన శుక్రవారం సమ్మక్క సారక్కల గద్దెల వద్ద భక్తుల సందడి నెలకొంది. సమ్మక్క సారక్కలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ఎత్తు బంగారంతో పాటు జంతు బలులతో తమ మొక్కులు చెల్లించుకుని చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సమ్మక్క జాత రకు విచ్చేసిన భక్తులకు శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



గొల్లపల్లి: గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామంలోని ఎక్కల్‌దేవి గుట్ట సమీపంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం ఆడవి బిడ్డలను భక్తులు సందర్శించు కుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు తమ ఇష్టదైవాలకు బెల్లం, కాట్న కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలంలోని పొలాస నర్సింహుల గుట్టపై సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలను మూడో రోజు ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మూడో రోజు అమ్మవార్లకు మొక్కుబడులు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు తులాభారాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఈ ఆధ్వర్యంలో భక్తులకు వసతులు, సేవలు కల్పించారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరెండెంట్లు, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈనెల 28వ తేదీ నుంచి మార్చి 14వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా, సమస్యలకు తావివ్వకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో విద్యుత్, ఫ్యాన్‌స, డ్యూయల్ డెస్క్, తాగనీరు, టాయిలెట్స్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిలత్లాలో 14,542 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారని వివరించారు. ఆర్‌డీవోలు తమ పరిధిలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఇంటర్ విద్యాధికారి నారాయణ, ఆర్‌డీఓలు రాజేశ్వర్, శ్రీనివాస్, శ్రీనివాస్ రావు, చీఫ్ సూపరెండెంట్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ధర్మపురి మున్సిపల్ బడ్జెట్ సమావేశం

ధర్మపురి, ఫిబ్రవరి 23: ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ అధ్యక్షతన శుక్రవారం బడ్జెట్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-2025 సంవత్సరానికి గాను బడ్జెట్ అంచనా ఆదాయం రూ 1411.90 లక్షలు కోసం కౌన్సిల్ సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించారు. ప్రభుత్వ సూచనల మేరకు ఈ బడ్జెట్‌ను తయారు చేశారు. ఇందులో ధర్మపురి పట్టణ హరిత లక్ష్యంగా గ్రీన్ బడ్జెట్ కోసం 10 శాతం నిధులు రూ 36.10 లక్షలు కేటాయించారు. పట్టణ ప్రజా ఆరోగ్య పారిశుధ్య నిర్వహణ కోసం రూ 67 లక్షలు కేటాయించారు. ప్రజల మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనుల నిమిత్తం, విలీన గ్రామాల అభివృద్ధి, వెనుకబడిన తరగతుల అభివృద్ధి నిమిత్తం కేటాయించారు. స్ట్రీట్ వెండర్స్ జోన్, ఆధునిక జంతు వధశాలలు నిర్మాణం, శాస్త్రీయ పద్ధతిలో డంపింగ్ యార్డులు, ఘణ ద్రవ్య వ్యర్థాల నిర్వహణ, మొదలగు వాటికి రూ 11.07 లక్షలు నిధులు కేటాయించారు. ఈ సమావేశంలో ధర్మపురి మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ గంగాధర్, జేఏవో కె. గణేష్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల వీడ్కోలు హంగామా



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ధర్మపురి, ఫిబ్రవరి 23: ధర్మపురి మండలంలోని మగ్గిడి ఆదర్శ పాఠశాల వార్షికోత్సవం, వీడ్కోలు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గంటల తరబడి నిర్వహించిన డ్యాన్స్ ప్రోగ్రాం ఎంతో ఆకట్టుకుంది. విద్యార్థుల డ్యాన్స్ ప్రోగ్రాంను పేరెంట్స్ తిలకించారు. అనంతరం బిగ్ బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ముత్యపు బుచ్చన్న మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి, మంచి స్థాయిలో ఉండాలని సూచించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతరకు ముస్తాబైన భీమన్న దేవాలయం

రాయికల్, ఫిబ్రవరి 23: రాయికల్ పట్టణ కేంద్రంలోని భీమన్న ఆలయం జాతరకు ముస్తాబైంది. రాయికల్ మండలం నుంచే కాకుండా చుట్టు పక్కల మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ నెల 24న శనివారం రాత్రి 8 గంటలకు భీమేశ్వర స్వామి కల్యాణం, 25న ఆదివారం దైవ దర్శనం, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, 26న సోమవారం భీమేశ్వర స్వామి రథోత్సవం నిర్వహిం చనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కథలాపూర్, ఫిబ్రవరి 23 : మండలంలోని ఇప్పపల్లికి చెందిన కోలి నరసింహారెడ్డి అనే రైతు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని శుక్రవారం రాత్రి వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి పరామర్శించారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాగండ్ల రమేశ్, జవ్వాజి రవి ఉన్నారు.

బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం

కోరుట్ల, ఫిబ్రవరి 23 : ఈ నెల 26వ తేదీన బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని కావేరీ గార్డెన్‌లో నిర్వహిస్తున్న విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ హజరు కానున్నట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో హజరైయి కార్యక్రమాన్ని విజయవంతం చేయ్యాలని అనిల్ కోరారు.

'హనుమాన్ ఆలయ అభివృద్ధికి కృషి'

జగిత్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిని అందిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 12వ వార్డులో గల ఉప్పరిపేటలో పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను పలువురు వెలమ సంక్షేమ సంఘ నాయకులు శాలువలతో సత్కరించారు. హనుమాన్ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. నాయకులు దామోదర్‌రావు, ఆనంద్‌రావు, రాజేశ్వర్, భగవంత రావు, సుధాకర్ రావు, సాగర్‌రావు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలి

జగిత్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు గెజిటెడ్ అధికారులు పకడ్బందీగా అమలు చేసేలా కృషి చేయాలని రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏనుగుల సత్యానారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా ఎక్సయిజ్ సూపరెండెంట్‌గా బదిలీపై వచ్చిన సత్యానారాయణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సత్యానా రాయణకు పలువురు జిల్లాలోని గెజిటెడ్ అధికారులు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు మామిడి రమేష్, అరిగెల అశోక్, డీఎంహెచ్‌వో పుప్పాల శ్రీధర్, రాజేందర్ రెడ్డి, మనీషా, అశోక్ రాజ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ లో చేరికలు

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 23 :జగిత్యాల రూరల్ మండలంలోని అనంతారం మాజీ ఉపసర్పంచ్ బత్తిని మహేష్, జగిత్యాల మాజీ వ్యవసాయకమిటీ వైస్ చైర్మన్ మోహసీన్, బత్తిని తిరుపతి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఏం చేశారని బీజేపీ విజయ సంకల్ప యాత్ర

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దేశానికి ఏం చేశారని బీజేపీ నేతలు విజయ సంకల్ప యాత్ర చేపట్టారని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయంపై ఆధారపడ్డ రైతాంగం ఢిల్లీ సరిహద్దులో పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంబానీ, ఆదానీ లాంటి పెట్టుబడి దారులకు ఎన్‌పీ అకౌంట్ల ద్వారా రుణ విముక్తులను చేశారని విమర్శించారు. రైతులను రుణ వి ముక్తులను ఎందుకు చేయరని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మద్ద తు ధరకు చట్టబద్దత కల్పిస్తే రైతు మద్దతు ధర పొందే అవకాశం ఉంటుందని వివరించారు. నిత్యవసర వస్తువుల ధరలపై పట్టించుకోవడం లేదని విమర్శించారు. పెట్రోలు ధరలు తగ్గించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. పదేళ్లుగా పెట్టుబడిదారుల కొరకే బీజేపీ నేతలు పనిచేశారని, పేదలకు కాదని మండి పడ్డారు. బీజేపీ నేతలు విజయ సంకల్ప యాత్ర ఎందుకు చేస్తున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పంటలకు కనీస మద్దతు ధరను అమలు చేయనం దుకు యాత్ర చేస్తున్నారా...ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు రూ. 73 వేల కోట్లు నుంచి రూ. 60 వేల కోట్లకు తగ్గించినందుకా అని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం బీజేపీ నాయకులు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో జగిత్యాల కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, గాజుల రాజేందర్, సిరాజోద్దిన్ మన్సూర్, మహంకాళి రాజన్న, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రాయికల్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి అన్నారు. మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన పద్మశాలి సంఘ సభ్యులు జీవన్ రెడ్డిని శుక్రవారం కలిశారు. తమ సంఘం సమస్యలను వివరించగా సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు జక్కుల రవీందర్, తాజా మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, యూత్ అధ్యక్షుడు జక్కుల సాగర్, రాజయ్య, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలం లోని పొలాసలోని 108 శ్రీ లలితామాత ఆలయంలో కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పాలెపు అజయ్ శర్మ జీవన్‌రెడ్డికి గోత్ర నాధులతో అర్చనచేసి ఆశీర్వదించారు. అనంతరం ఆలయ పక్షాన ఎమ్మెల్సీ ని ఘనంగా సన్మానించారు. అనంతరం పొలాసలోని వేయిలింగాల ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండ శంకర్, గిరినాగభూషణం, కటారి చంద్రశేఖర్‌రావు, సత్తయ్య పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి

ఎమ్మెల్యే లాస్య నందిత మృతి బాధాకరం

బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే ఘన నివాళులు



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి చెందడం బాధాకరమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే లాస్య నందిత చిత్ర పటానికి పూల మాలలు సమ ర్పించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిన్న వయస్సులోనే ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం విచారకరమన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య కార్పొరేటర్‌గా, ఎమ్మెల్యేగా ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే లాస్య మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటన్నారు. లాస్య నందిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినిని అభినందించిన ఉపాధ్యాయులు

రాయికల్, ఫిబ్రవరి 23: మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థి దాసరి జలధీజను ఉపాధ్యాయులు అభినందించారు. శ్రీ సత్య సాయి ఆర్గనైజేషన్ వారు నిర్వహించిన "సమయం వృథా చేస్తే జీవితం వృథా" అనే అం శంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం, మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా మెట్‌పల్లి శ్రీ సత్యసాయి దేవాలయంలో గురువారం జలధీజకు ప్రశంసాపత్రం, మెమోంటో అందజేసినట్లు ఉపాధ్యాయురాలు శ్రీమతి తెలిపారు. ఈ సందర్భంగా జలధీజను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

జగిత్యాల బల్దియా బడ్జెట్ రూ. 62.40 కోట్లు

- ఆమోద ముద్ర వేసిన కౌన్సిల్
- అభివృద్ధి పనులకు అంతంతే కేటాయింపులు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 23: జగిత్యాల బల్దియా బడ్జెట్ 2024-25 సంవత్సరానికి గాను రూ.6,240.01 లక్షల బడ్జెట్‌ను కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో ప్రవేశ పెట్టారు. కౌన్సిలర్లు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించి బడ్జెట్‌ను ఆమోదించారు. శుక్రవారం బల్దియా ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ అధ్యక్షతన కౌన్సిల్ బడ్జెట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అకౌంట్స్ అధికారి గణేష్ తొలుత బడ్జెట్ వివరాలను వివరించారు. 2023-24 సంవత్సరంలోని ప్రారంభ నిల్వ రూ.1,097.69 లక్షలతో పాటు సవరణ అంచనా ఆదాయం రూ.4,521.75 లక్షలు పోగా, వ్యయాలు రూ. 5,619.44 లక్షలు అయి నట్లుగా అధికారులు కౌన్సిల్‌లో బడ్జెట్‌ను సమర్పించారు. అన్ని ఖర్చులు పోగా రూ. 869.87 లక్షలు మిగులు ఆదాయాన్ని చూపించారు. 2024-25 సంవత్సరానికి రూ. 869.87 లక్షల ప్రారంభ నిలువతోపాటు సాధారణ నిధుల అంచనా ఆదాయం రూ.2,766.08 లక్షలుగా అంచనా వేయగా, ప్లాన్, నాన్ ప్లాన్ గ్రాంట్స్ అంచనా ఆదాయం రూ.2,604.06 లక్షలతో కలుపుకుని రూ. 6,240.01 లక్షలతో బడ్జెట్‌ను రూపొందించారు. ఇందులో సాధారణ నిధులు, నాన్ ప్లాంట్, గ్రాంట్ అంచనా వ్యయాన్ని రూ.5,718.44 లక్షలు ఖర్చు అవుతుందని లెక్కల్లో చూపించి, మార్చి 31, 2025 నాటికి రూ. 398.59 లక్షల ఆదాయం మిగిలే విధంగా బడ్జెట్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ మాట్లాడుతూ బల్దియాను మరింత అభివృద్ధి చేసేందుకు కౌన్సిలర్లతో చర్చించి ఆమోదం పొందిన బడ్జెట్‌ను కలెక్టర్‌తో పాటు కమిషనర్, పురపాలక శాఖకు ఆమోదం కోసం పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అనీల్ బాబు, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. శుక్రవారం కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పలువురు కౌన్సిలర్లు తమ అభిప్రాయాలు వెల్లడించారు. గత సంవత్సరం కంటే ఈ సారి బడ్జెట్ రూ. 223.19 లక్షలు పెంచి బడ్జెట్‌ను తయారు చేశారన్నారు. ప్రజలకు ఉప యోగకరంగా ఈ బడ్జెట్ లేదని పలువురు కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకువచ్చారు. మరికొంత మంది కేవలం అంకెల గారడిలాగే బల్దియా బడ్జెట్ ఉందని ఆరోపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

సొంత ఆదాయం రూ. 2,766.08 లక్షలు

రూ. 6,240.01 లక్షలు బడ్జెట్‌లో సొంత ఆదాయంగా రూ. 2,766.08 లక్షలు చూపించారు. పన్నుల ద్వారా ఆదాయం రూ. 1,419.73 లక్షలు వస్తుందని, అసైన్డ్ రెవెన్యూ ద్వారా ఎలాంటి ఆదాయం లేదని, పన్నేతర ఆదాయం ద్వారా రూ. 1,346.35లక్షల ఆదాయం సమకూరనుందని బడ్జెట్‌లో పొందుపరిచారు. వచ్చిన ఆదాయం ఖర్చులకే పరిమితమవుతుందని లెక్కలు వేశారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతాల కోసం రూ. 850 లక్షలు, పారిశుధ్య నిర్వహణకు రూ.323.20 లక్షలు, విద్యుత్ చార్జీలకు రూ.57 లక్షలు కేటాయించా రు. రుణాల చెల్లింపు కోసం రూ. 200 లక్షలు, గ్రీన్ బడ్జెట్ కోసం 10 శాతం నిధులను రూ.276.60 లక్షలు కేటాయించారు. ఇతర నిర్వహణ వ్యయానికి రూ. 461.40 లక్షలు, మూడవ వంతు మిగులు బడ్జెట్ కేటాయింపులో భాగంగా రూ.199.29 లక్షల నిధులను కేటాయించారు. అంచనాల్లో మిగులు బడ్జెట్, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ. 398.59 లక్షలు చూపించారు. ఇలా అంచనా నిర్వహణ ఆదాయం మొత్తం వ్యయం లెక్కలతో సరి చేస్తూ బడ్జెట్‌లో పొందుపరిచారు. గత సంవత్సరం 2,539.29 రూ. లక్షల అంచనా ఆదాయం వస్తుందని లెక్కలు వేయగా, ఈ సారి రూ. 2,766.08 లక్షల ఆదాయం వస్తుందని అంచనాలు తయారు చేశారు. దీనిని బట్టి బల్దియా ఆదాయం రూ. 226.79 లక్షల ఆదాయం పెంచి లెక్కలు వేయడం కనిపించింది.

రాజన్న సేవలో పీఎఫ్ కమిషనర్

వేములవాడ ఫిబ్రవరి 23 : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రావిడెంట్ ఫండ్ సౌత్ జోన్ అడిషనల్ సెంట్రల్ కమిషనర్ వైశాలి దయాల్ దర్శించుకున్నారు. శుక్రవారం ఆమె కోడె మొక్కు చెల్లించుకుని శ్రీ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం గావించారు. ఆలయ ఏఈఓ ప్రతాప నవీన్ శ్రీస్వామి వారి ప్రసాదం అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు అల్లి శంకర్, గోలి శ్రీనివాస్, అరుణ్ తదితరులు ఉన్నారు.



ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఏఈఓ నవీన్

సిరిసిల్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 23: సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్‌లో 40 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని మున్సిపల్ సిబ్బంది తరలించారు.

మంటలు అంటుకుని చెట్లు దగ్ధం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 23: కొత్తపల్లి మండలం నాగుల మల్యాల గుట్టపై చెట్లకు మంటలు అంటుకుని దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పుతున్నారు. రాత్రి వరకు మంటలు అదుపులోకి వచ్చాయని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

వైభవంగా నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

కొడిమ్యాల, ఫిబ్రవరి 23: మండలంలోని నల్లగొండ నృసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం నిర్వహించు రథోత్సవానికి భక్తులు తరలివస్తున్నారు. శుక్రవారం స్వామి వారిని గజవాహనంపై ఊరేగించారు. ఉదయం నుంచి భక్తులు ఎగువ, దిగువ ఆలయాల్లో నృసింహస్వామిని దర్శించుకొని స్వామి వారికి పట్టెనామాలు కోరమీసాలు సమర్పించుకున్నారు. స్వామి వారిని దర్శించుకోవటానికి వచ్చిన భక్తులు చలువ పందిళ్ల కింద సేద తీరుతున్నారు. ఆలయ చైర్మెన్ సత్యనారాయణ రావు, ఈవో అనూషతో పాటు సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

తహసీల్దార్‌పై కేసుతో కలవరం

● సీఐ నటేష్‌పై సీపీ రిపోర్ట్‌తోనే సస్పెన్షన్ వేటు?
● పలువురు పోలీసు, ఇతర శాఖల అధికారులకు నోటీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 23: కోర్టులో పెండింగ్‌లో ఉన్న వివాదానికి సంబంధించిన భూమిని నిందితులతో కుమ్మక్కై మ్యుటేషన్ చేసినట్లు ఆరోపణలపై గతంలో కొత్తపల్లి తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన చిల్ల శ్రీనివాస్‌పై కొత్తపల్లి ఠాణాలో మంగళవారం కేసు నమోదు కావటం కలకలం సృష్టించింది. ఈ కేసులో విచారణకు హాజరుకావాలంటూ తహసీల్దార్‌కు మూడు రోజుల కిందట కరీంనగర్ రూరల్ పోలీసుల సీఆర్‌పీసీ 160 కింద నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న తహసీల్దార్ శుక్రవారం ఉదయం 11 గంటలకు కరీంనగర్ రూరల్ సీఐ కార్యాలయంలో హాజరు కావాల్సి ఉన్నది.

అయితే శుక్రవారం ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేసి తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై అరెస్టు చేయకుండా గురువారం వరకు మినహాయింపు పొందినట్లు తెలిసింది. మరో వైపున జగిత్యాల టౌన్ సీఐ సిహెచ్ నటేష్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆయన గతంలో కరీంనగర్ ఒక టో ఠాణా సీఐగా పనిచేసిన సమయంలో పలు భూవివాదాలకు సంబంధించి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. సీఐపై కరీం నగర్ సీపీ రిపోర్టు తయారు చేసి ఐజీకి పం పించారని ఈ నేపథ్యంలో ఆయనపై విచారణ జరిపి సస్పెన్షన్ వేటు వేశారని తెలిసింది. రెండు నెలల కిందట కూడా పలు ఆరోపణ లపై కరీంనగర్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు సీఐలపై సీపీ, ఐజీకి రిపోర్ట్ పంపించి బదిలీవేటు వేసిన విషయం విదితమే. కరీంనగర్‌లో భూకబ్జాలకు సంబం ధించి ఇప్పటి వరకు 7 కేసులు నమోదుకాగా 13 మంది అరెస్టు అయ్యారు.

● సీపీ, కలెక్టర్ బదిలీ తప్పుడు ప్రచారంపై నిఘా

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లు బదిలీ అయ్యారంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి వైరల్ చేయడంపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ దుష్ప్రచారాన్ని ఎవరు చేస్తున్నారు? ఎవరు చేయిస్తున్నారనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇటీవల కొందరు భూకబ్జాలకు సంబంధించిన కేసుల్లో అరెస్టుకాగా వారి అనుచరులుగా చెప్పకుంటున్న కొంతమంది యువకులు ఈ తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు పోలీసులు ఇప్పటికే గుర్తించి చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.



భూ విక్రయంలో మోసం చేసి, బెదిరింపులు

● ముగ్గురిపై కేసు, ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 23: భూమి విక్రయంలో మోసం చేయటమే కాకుండా చంపుతానని బెదిరింపుల కు పాల్పడిన ఘటనలో జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న దుర్గం జగన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు నందెల్లి మహిపాల్,సదాశివపల్లికి చెందిన సింగిరెడ్డి వెంకటరమణారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు మానకొండూర్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎన్‌టీపీసీలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొంది ప్రస్తుతం కరీంనగర్ భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఎల్లాల అజేంధర్‌రెడ్డి 2019లో మానకొండూర్ మండలం సదాశివపల్లిలోని సర్వే నెంబరు 442, 447/2, 443లలోని మూడెకరాల అరగుంట భూమిని కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన దుర్గం జగన్‌గౌడ్, తిరుపతి అనే వ్యక్తి ద్వారా కొనుగోలు చేశాడు. ఆ తరువాత ఆ భూమిలోకి వెళ్లిన అజేంధర్‌రెడ్డిని, సింగిరెడ్డి వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి అడ్డుకుని ఆ భూమి తనదేనని చెప్పటంతో ఇద్దరి మధ్య భూవివాదం తలెత్తింది. ఈ విషయంపై మాట్లాడేం దుకు అజేంధర్‌రెడ్డిని సదాశివపల్లికి పిలిచిన దుర్గం జగన్‌గౌడ్, నందెల్లి మహిపాల్, సింగిరెడ్డి వెంకటరమణారెడ్డి ముగ్గురు కలిసి అజేంధర్‌రెడ్డిని చంపుతానని బెదిరించారు.

మోసపోయిన బాధితుడు అజేంధర్‌రెడ్డి శుక్రవారం మానకొండూర్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు ముగ్గురు నిందితులపై ఐపీసీ 420, 467, 386, 506, 120-బి రెడ్‌విత్ 34 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ కేసులో దుర్గం జగన్‌ను శుక్రవారం అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరచగా జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.



వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా వసంతోత్సవం

బీర్‌పూర్, ఫిబ్రవరి 23: బీర్‌పూర్ లక్ష్మీనరసింహా స్వామి జాతర బ్రహ్మోత్స వాలలో భాగంగా శుక్రవారం లక్ష్మీ నరసింహులకు వసంతోత్సవం కార్యక్రమాన్ని వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉత్సవ ముహుర్తులను ప్రత్యేకమైన వేదికపై ఆశీనులగావించి వేదమంత్రోచ్చరణల మధ్య వసంతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, కెడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచంధర్ రావ్, ఆలయ ఈవో సంకుటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటి మెంబర్ ఎనగంటి సామ్రాట్, అర్చకులు సంతోష్, మధు కుమార్, సంతోష్, సిబ్బంది రాజయ్య, వెంటేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్యాక్స్ డైరెక్టర్ మృతి



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 23: మండల సహకార సంఘం డైరెక్టర్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి (45) రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. శ్రీనివాస్ రెడ్డి గురువారం సాయంత్రం కరీంనగర్‌కు వెళ్లి ద్విచక్రవాహనంపై మండలంలోని పొత్తూర్‌కు తిరిగి వస్తుండగా కమాన్‌పూర్ వద్ద గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌రెడ్డిని కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, ప్యాక్స్‌చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ సిద్దం శ్రీనివాస్, ఎంపీటీసీ పట్నం అశ్వినీశ్రీనివాస్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ సౌమ్యుడు శ్రీనివాస్‌రెడ్డి మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటన్నారు. కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామన్నారు.

పంది అడ్డురావడంతో బైక్ నుంచి పడి..

కరీంనగర్ క్రైం: కొత్తపల్లి మండల కేంద్రంలోని ఓ రెస్టారెంట్ ఎదురుగా శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్ కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన ఎండీ ఖలీల్లా(35) అక్కడికక్కడే మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖలీల్లా తన ద్విచక్రవాహనంపై వెళుతుండగా పంది అడ్డురాగా అదుపుతప్పి కిందపడటంతో తలకు బలమైన గాయాలై మరణించాడని తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని రైతు..



గౌరు రాజయ్య(ఫైల్)

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం రాళ్లపేట శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాళ్ల పేట గ్రామానికి చెందిన గౌరు రాజయ్య (52) అనే రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం రాత్రి రాజయ్య తన పొలం వద్ద నుంచి గేదెను తీసుకొని ఇంటికి వస్తున్నాడు. వెనక నుంచి ప్యాసింజర్ ఆటో ఢీ కొట్టింది. దీంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి..

కరీంనగర్ క్రైం: భగత్‌నగర్ వెంకటేశ్వర కాలనీలో తన సోదరుడి గృహప్రవేశం సమయంలో ప్రమాదవశాత్తుగా కాలుజారి కిందపడి ఈదులగట్టెపల్లికి చెందిన మీస రాంచంద్రం(46) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న భవనం మూడో అంతస్తు పైనుంచి కిందపడడంతో రాంచంద్రంకు తీవ్రగాయాలయ్యాయన్నారు. అతన్ని వెంటనే కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి, హైదాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం రాత్రి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడు ఆర్టీసీ డిపో-1లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 23: హైదరాబాద్‌లోని బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన షెడ్యూల్ కులాల బాలబాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి ఇంగ్లీష్ మీడియంలో రెండు సీట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, 2017 జూన్ 1 నుంచి 2018 మే 31 మధ్యలో జన్మించిన బాల బాలికలు ప్రవేశాలకు అర్హులని అన్నారు. వారి తల్లిదండ్రుల వార్షిక ఆదా యం గ్రామీణ ప్రాంతాల వారికి లక్షా 50 వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల మించరాదని, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రం సంబంధిత తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లనుంచి పొం దాలని సూచించారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను మీసేవ, మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి పొందాలని, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుల జిరాక్సు ప్రతులపై గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి దరఖాస్తుతో పాటు జత చేయాలని సూచించారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం నుంచి ఈనెల 25 నుంచి మార్చి 12వ తేదీ వరకు అన్ని పనిదినాల్లో పొంద వచ్చన్నారు. దరఖాస్తులను మార్చి 12న సాయంత్రం ఐదుగంటలలోపు రెండు పాసుపోర్టు సైజు ఫొటోలతో జతచేసి సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అంజన్న పైసలేవీ..?

● ఖాతాకు చేరని రూ.37.90లక్షల టెండర్ సొమ్ములు ● కొండగట్టులో అధికారుల నిర్వాకం



మల్యాల, ఫిబ్రవరి 23: కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో నిర్వహించే వివిధ దుకాణాల టెండర్‌దారులు చెల్లించే డబ్బులు అంజన్న ఖాతాకు చేరకపోవడం తీవ్ర దుమారం లేపుతోంది. వ్యాపారులు తమ టెండర్ సొమ్ములను దేవస్థానానికి విడతల వారీగా చెల్లిస్తుండగా 2023-24 సంవత్సరానికి గాను కొందరు వ్యాపారులు దేవస్థానం అధికారు లకు చెల్లించారు. వాటికి రశీదులు కూడా ఇవ్వగా ఆ డబ్బులు మాత్రం దేవస్థానం ఖాతాలో చేరలేదు. ఇటీవల దీనిపై అనుమానాలు వ్యక్తం కావడంతో దేవస్థానం అధికారులు తమ అకౌంట్స్ తనఖీలు చేశారు. ఇందులో రూ 37.90లక్షలు బ్యాంక్ లెక్కల్లో కనిపించకపోగా విచారణ చేశారు. సంబంధిత వేలంల సెక్షన్ అధికారి వాటిని ఖాతాలో జమ చేయనట్లు గుర్తించారు. కొబ్బరికాయలకు సంబంధించి రూ.31.80లక్షలు, కిరాణం రూ.60వేలు, హోటల్ రూ.50వేలు, సులభ్ కాంప్లెక్స్ రూ.2లక్షలు, పూలు, పండ్లు రూ.3లక్షలు ఆయా వ్యాపారుల నుంచి అధికారులు వసూలు చేసినప్పటికీ వాటిని జమ చేయకుండా సొంతంగా వినియోగించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులు వసూలు చేసి ఖాతాలో జమ చేయనట్లు తేలడం చర్చ నీయాంశంగా మారింది.

దీంతో గతంలోని వాటిని కూడా తనిఖీలు చేయాలనే డిమాండ్లు వెల్లువెత్తుతుండగా దేవాదాయ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో వెంకటేష్‌ను వివరణ కోరగా.. ఖాతాలో జమ చేయనట్లు తమ దృష్టికి వచ్చిందని సదరు ఉద్యోగికి నోటీసు అందించనున్నట్లు తెలిపారు. సదరు వేలంల సెక్షన్ అధికారిని కూడా సంప్రదించే ప్రయత్నం చేయగా ఆయన ఫోన్ స్విచాఫ్ వచ్చింది.

కాంగ్రెస్ హామీలకు నో 'గ్యారెంటీ'

● పథకాల అమలుకు సిద్ధంగా లేని సర్కారు
● మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
● కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

మహదేవపూర్, ఫిబ్రవరి 23: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదని మాజీ మంత్రి, బీఆర్ ఎస్ నేత కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. పెద్దపల్లి జడ్పీ చైర్‌పర్సన్ పుట్ట మధుతో కలిసి కాళేశ్వరం ఆలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ప్రత్యేక పూజల అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజలకు బతుకు భరోసా ఇవ్వలేకపోతోందన్నారు. సమస్యలపై ప్రజలు ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి, మంత్రులు మనోభావాలను దెబ్బ తీసేలా మాట్లాడు తు న్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను పక్కన బెట్టి వాటిపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రమంతా సాగు, తాగు నీటిని అందిస్తే దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇంత పెద్ద ప్రాజెక్టులో మేడిగడ్డలో చిన్న పిల్లర్‌లో సమస్య ఏర్పడితే సరిచేసి నీళ్లు అందించాలని గానీ కాలయాపన చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బ్లాక్ మెయిలింగ్, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ చర్యలను ఖండిస్తున్నామన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 23: బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించి మాదిగలను గెలిపించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మాదిగల జోడో యాత్రలో భాగంగా శుక్రవారం కరీంనగర్‌కు చేరుకున్న ఆయన నగరంలో యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల మోసపూరిత మాటలు విని, ఆయా పార్టీలకు ఓటు వేస్తే తెలంగాణ రాష్ట్రం మతకల్లోలాలు, కింది స్థాయి జాతుల అణచివేతతో రాష్ట్రం తీవ్ర సంక్షోభంలోకి వెలుతుందన్నారు. ఆయా పార్టీలకు ఓటు వేయకుండా సబ్బండ కులాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వంపై ఎన్నడూ ఒత్తిడి చేయలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో మాదిగలను రాజకీయంగా అణచి వేశారని ఆరోపించారు. బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకమన్నారు. అందులో భాగం గానే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి రిజర్వేషన్లను తగ్గించిందని ఆరోపించారు. మళ్లీ బీజేపీకి ఓటు వేస్తే ఏ ఒక్క ప్రభుత్వ ఉద్యోగం కూడా దక్కదన్నారు. రాష్ట్రంలో మాదిగలు బీజేపీని ఓడించడమే 30ఏళ్ల వర్గీకరణకు ఇచ్చే సంపూర్ణ మద్దతు అని అన్నారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని పెంచాలన్నారు. దేశంలో బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం అతి ప్రమాదకరంగా ఉందని, దీనిని కాపాడాల్సిన బాధ్యత చైతన్యవంతులైన మాదిగలపై ఉందన్నారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మెడపట్ల దుబ్బయ్య, అక్కనపల్లి కరుణాకర్, బండ శ్రీను, ఆరెపల్లి అరుణ్‌కుమార్, కనకం వంశీ, గడ్డ యాదయ్య, బొరెల్లి సురేష్, మైన ఉపేందర్, ముత్యపాగం నరసింహారావు, ప్రసాద్, నక్క మహేశ్,దేవరకొండ నరేష్, గద్దల రమేశ్, జోగు గణేశ్, మీసాల మహేశ్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 23: పట్టణంలోని సైదాపూర్ రోడ్‌లో గల ఓ మూడతస్తుంతల భవనంలో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చేలరేగి దట్టమైన పొగలు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖాధికారులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగడంతో పక్కనే ఉన్న నివాస గృహాల వాళ్లు భయందోళనకు గురయ్యారు.

గొల్లపల్లిలో చోరీ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23: మండలంలోని గొల్లపల్లి , బొప్పాపూర్ గ్రామాల్లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంతో పాటు మొడుసు సత్యంరెడ్డి దుకాణంలో దొంగలు గురువారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. బొప్పాపూర్ సత్తే పీరీల దర్గా సమీపంలోని సత్యంరెడ్డి దుకాణం తాళాలు పగలగొట్టి రూ.3 వేల విలువైన కూల్ డ్రింక్స్, సిగరెట్ ప్యాకెట్లు, ఇతర తినుబండారాలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రమాకాంత్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలను విజయవంతం చేయాలి



రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 23: కరీంనగర్ ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్‌ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలను విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఒలింపిక్ సంఘం ప్యాటరన్, మానేరు విద్యాసంస్థల అధినేతి కడారి అనంతరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పోటీల వాల్ పోస్టర్‌ను ఆయన ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే కుంగ్‌ఫూ క్రీడలకు కరీంనగర్ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందన్నారు. కరాటే కుంగ్‌ఫూలతో ఆత్మస్థైర్యం ఆత్మ విశ్వాసం పెంపొందుతా యన్నారు. ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు కరాటే కుంగ్‌ఫూలలో శిక్షణ పొందాలని, ముఖ్యంగా అమ్మాయిలు ఇలాంటి విద్యలో శిక్షణ పొందాలని సూచించారు. తొలిసారిగా జిల్లా కేంద్రంలో కుంగ్‌ఫూలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. పోటీల చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, నిర్వాహకులు ఎ శ్రీనివాస్, జూడో సంఘం రాష్ట్ర బాధ్యులు సిలవేరి మహేందర్, ఉషు సంఘం ప్రధాన కార్యదర్శి బార విద్యాసాగర్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు లింగమూర్తి, మోయిన్, కోడూరి శేఖర్, లంక రవివర్మ, సాయిమానేరు ప్రిన్సిపాల్ సరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



ప్రభాకర్ (ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 23: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని గన్నెవానిపల్లె పరిధిలోని నిమ్మవానిపల్లెలో శుక్రవారం విద్యుదాఘాతం తో నిమ్మల ప్రభాకర్(42) మృతి చెందా డు. ప్రభాకర్ తన పొలం వద్ద గడ్డికోయడానికి వెళ్లగా, బోరు మోటార్‌కు వచ్చే సపోర్ట్ వైరుకు విద్యుత్ సరఫరా అవడంతో గమనించని ప్రభాకర్ వైరుకు తగలడంతో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముస్తాబాద్, ఫిబ్రవరి 23 : మండలంలోని బంద నకల్ గ్రామానికి చెందిన అల్మాస్‌పూర్ ఆశయ్య (52) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై శేఖ ర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొంత కాలంగా అనా రోగ్యంతో బాధ పడుతున్న ఆశయ్య మనస్తాపంతో ఈనెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేటలోని ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణిం చాడని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఆశయ్య కూతు రు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

రుద్రంగి, ఫిబ్రవరి 23: రుద్రంగి మండలం దేగవాత్ తండా గ్రామంలోని కున్‌సోత్ తండాకు చెందిన కున్‌సోత్ ముత్యాలి (90) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కొద్ది సంవత్సరాలుగా ముత్యాలి ఆనారోగ్యంతో బాధపడుతోంది. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

జగిత్యాల టౌన్ సీఐ నటేశ్ సస్పెన్షన్

జగిత్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ సీఐగా పనిచేస్తున్న నటేశ్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్ -1 ఐజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి, క్రైం బర్కింగ్ ఆరో పణల్లో విచారణ జరిపిన నేపథ్యంలో నటేశ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. పోలీస్ స్టేషన్ వచ్చిన ఫిర్యాదులను పట్టించుకోకపోవడం, కేసులు నమోదు చేయకుండా జాప్యం వహించ డం, అవినీతికి పాల్పడడం వంటి ఆరోపణలపై ఇటీవల పోలీసు ఉన్నతాధికారులు నటేశ్‌పై విచారణ జరిపించినట్లు సమాచారం. నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి ఇజ్రాయిల్ దేశానికి పంపిస్తానని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యవహారంలో సీఐ నటేశ్ నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై విచారణ జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా జగిత్యాల పట్టణ సీఐగా పనిచేస్తున్న నటేశ్‌ను ఇటీవల బదిలీ చేయగా రాజకీయంగా ఒత్తిడి తెచ్చి బదిలీని నిలిపివేయించుకోవడం సైతం ఉన్నతాధికారుల అసంతృప్తికి కారణమైందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సీఐ నటేశ్ సస్పెండ్ వ్యవహారం పోలీసువర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

చిరుత దాడిలో మేక మృతి

చందుర్తి, ఫిబ్రవరి 23 : చందుర్తి మండలం లింగంపేట శివారులో చిరుత పులి సంచారం మండల ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. మండలంలోని లింగంపేట అటవీ ప్రాంతం శివారులో చిరుతపులి దాడిలో మేక మృతి చెందినట్లు అటవీ శాఖ బీట్ ఆఫీసర్ రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. లింగంపేట అటవీ ప్రాంతంలో గ్రామంలోని ఈగ రాజేశంకు చెందిన మేక మృతి చెందిన విషయాన్ని గ్రామస్థులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందజేశారు. అటవీ ప్రాంతం శివారులో మృతి చెందిన మేకను పరిశీలించగా చిరుతపులి దాడి చేసినట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.


గల్ఫ్‌లో బొప్పాపూర్ వాసి హఠాన్మరణం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23:ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన నిమ్మల రాజు(45) బహ్రెయిన్‌లో గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. నిమ్మల రాజు 15 ఏళ్లుగా బహ్రెయిన్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, రోజులాగే విధులకు వెళ్లిన అతను ఛాతిలో నొప్పితో అస్వస్థతకు గురయ్యాడన్నారు. మిత్రులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని తెలిపారు. పరీక్షించిన అక్కడి వైద్యుడు గుండెపోటుతో చనిపోయాడని నిర్ధారించారన్నారు. ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ కాలువలో పడి వృద్ధురాలు మృతి

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 23 : పట్టణానికి చెందిన సిర్ప సుజాత(60) శుక్రవారం ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందిం దని ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సిర్ప సుజాతకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం భర్త లక్ష్మీనారాయణ, కుమారుడు మృతి చెందారు. ఇద్దరు కూతుళ్లకు వివాహం జరగగా సుజాత పట్టణంలోని కూరగాయాల మార్కెట్ ఏరియాలో ఉంటోంది. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది.ఆసుపత్రులకు వెళ్లినా నయం కాకపోవడంతో మానసికంగా ఇబ్బంది పడుతోంది. శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు పట్టణంలోని ఎస్సారెస్పీ కాలువలో పడి కొట్టుకుపోతుండగా సమీపంలోని వారు చూసి బయటకు తీసి ఆసపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. సుజాత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మానకొండూర్, ఫిబ్రవరి 23 : మండలంలోని దేవంపల్లి గ్రామంలో గల కాకతీయ డిబిఎం 6 ఉపకాల్వలో శుక్రవారం ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కాకతీయ ప్రధాన కాల్వ నుంచి డీబీఎం 6 ఉపకాల్వలో ఓ వ్యక్తి మృత దేహాన్ని గ్రామస్థులు గుర్తించి కాల్వలో నుంచి బయటికితీసారు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న సీఐ రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



తల్లుల ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు




తల్లుల దర్శనం కోసం క్యూ లైన్లలో బారులుదీరిన భక్తులు



తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ క్యూ లైన్లలో జనం



తిరుగుపయనమైన భక్తులతో ఆర్టీసీ బస్టాండ్ క్యూలైన్లు. భక్తులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు



మొక్కులు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసి పోయిన గద్దెల ప్రాంగణం

భక్త జన హోరు..

▶▶ వనదేవతల రాకతో పోటెత్తిన భక్తులు ▶▶ నిరంతరాయంగా దర్శనాలు ▶▶ మొక్కులు చెల్లించుకున్న సీఎం, గవర్నర్



మేడారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో మూడోరోజు శుక్రవారం కూడా భక్తులు జోరుగా మొక్కులు సమర్పించుకున్నారు. తల్లుల దర్శనాలు నిరంతరాయంగా కొనసాగుతుండగా తరలివస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం పోటెత్తుతోంది. క్యూలైన్లన్నీ కిటకిటలాడుతున్నాయి. వీఐపీ ప్రవేశ ద్వారాల వద్ద కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వేచిచూస్తుండడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకున్న తర్వాత భక్తులు మొక్కులు చెల్లించుకోవడం మరింత జోరందుకుంది.

ప్రముఖుల తాకిడి

జాతరలో శుక్రవారం వీఐపీల తాకిడి పెరిగింది. ప్రముఖులంతా ఈ రోజే రావడంతో అధికారులపై ఒత్తిడి కనిపించింది. గవర్నర్ తమిళిసై సౌందరాజన్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్కను దర్శించుకొని మొక్కులను సమర్పించుకున్నారు. ఉదయం గవర్నర్‌తోపాటు కేంద్రమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు చీరెలను సమర్పించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్ఎస్‌పీ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ సీఎం శాంతికుమారి తదితరులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు మంత్రి సీతక్క సీఎంకు స్వాగతం పలకగా అధికారులు ఆలయ మర్యాదలతో గద్దెల వద్దకు తోడ్కొని వెళ్లారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు తల్లులను దర్శించుకున్న వారిలో ఉన్నారు.



నేడు వన ప్రవేశం.. ముగియనున్న జాతర

గద్దెలపై కొలువుదీరి భక్తులకు ఆశీస్సులం దిస్తున్న వనదేవతలు శనివారం వనప్రవేశం చేయనున్నారు. దీంతో నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన సమ్మక్క సారలమ్మ మహాజాతరకు తెరపడనుంది. శనివారం సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్యతో పాటు మిగతా పూజారులు సమ్మక్క గద్దె వద్దకు చేరుకొని చివరి పూజలు చేసి. తల్లి రూపాన్ని తీసుకొని చిలకలగుట్టపైకి తీసుకువెళ్లి నిజస్థానంలో ఉంచి వెనుదిరుగుతారు.

విప్ అడ్లూరికి ఎమ్మెల్సీ పరామర్శ

ధర్మపురి, ఫిబ్రవరి 23: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయిన ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను శుక్రవారం ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పరామర్శించారు. ధర్మపురి పట్టణంలోని లక్ష్మణ్‌కుమార్ నివాసానికి వెళ్లారు. సంఘటన జరిగిన తీరు, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. లక్ష్మణ్ కుమార్‌ను బుగ్గారం, ధర్మపురి జడ్పీటీసీలు బాదినేని రాజేందర్, బత్తిని అరుణ కూడ పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బండ శంకర్, మాజీ సర్పంచ్ తాటిపర్తి శోభారాణి పాల్గొన్నారు.

'సొసైటీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి'

ధర్మపురి, ఫిబ్రవరి 23: రైతులకు సొసైటీ ద్వారా తక్కువ వడ్డీతో పొందిన రుణాలు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి కోరారు. ధర్మపురి పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో సొసైటీ పరిధిలో గల ఆరుగురు రైతులకు రూ 23,00,000 దీర్ఘకాలిక రుణాలు సంబంధించిన చెక్కులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఆకుల గంగయ్య, ఆకుల నారాయణ, బిళ్లకూరి కళకు రూ 3 లక్షలు చొప్పున, బిళ్లకూరి రవి, ముంజాల భీమాగౌడ్‌కు రూ 4 లక్షలు చొప్పున, సందవేని కొమురయ్యకు రూ 6 లక్షలు చొప్పున రుణాలు పొందినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి పీఏసీఎస్ సీఈవో అయ్యోరు రాజేష్, పాలకవర్గ సభ్యులు పెరుమాండ్ల ఎల్లా గౌడ్, పెరుక రమేష్, నక్క రాజు, రైతులు పాల్గొన్నారు.

'బండి సంజయ్‌పై విమర్శలు సరికాదు'

మల్యాల, ఫిబ్రవరి 23: ఎంపీ బండి సంజయ్‌పై మాజీ ఎమ్మెల్యేరవిశంకర్ చేసిన విమర్శలు సరికాదని మండల బీజేపీ అధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్ అన్నారు. ప్రజలు ఓడించినప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంకా ఉందనే భ్రమలో రవిశంకర్ ఉన్నట్లు అనిపిస్తుందని పేర్కొన్నారు. కరోనా సమయంలో నియోజకవర్గంలో సంజయ్ అందించిన సేవలు మరిచి విమర్శలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌ను నేలమట్టం చేయనున్నారని అన్నారు. విమర్శలు మానుకోవాలని సూచించారు

నేడు విండో చైర్మన్‌పై అవిశ్వాస సమావేశం

మల్యాల, ఫిబ్రవరి 23: మల్యాల సింగిల్‌విండో చైర్మన్ రాంలింగారెడ్డిపై డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ నోటీసులు అందించగా నేడు సమావేశం ఏర్పాటు చేశారు. సొసైటి పరిధిలో 13 మంది డైరెక్టర్లు ఉండగా ఆరుగురు తో పాటు ఇద్దరు సంఘ సభ్యులు అవిశ్వాస తీర్మాణం అందించారు. ఇందులో నుంచి ఓ డైరెక్టర్ మళ్లీ చైర్మన్‌తో క్యాంప్‌కు వెళ్లడం చర్చనీయంశంగా మారింది. అవిశ్వాసం నెగ్గుతుందా.. వీగుతుందా నేడు తేలనుంది.

రజక సంఘ భవన అభివృద్ధికి నిధుల కేటాయింపు

కోరుట్ల, ఫిబ్రవరి 23 : పట్టణంలోని పటేల్ రోడ్డులోని రజక సంఘ భవన అభివృద్ధికి నిజామాబాద్ ఎంపీ అర్వింద్ తన కోటా నుంచి నిధులు మంజూరు చేసినట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిది ఇందూరి తిరమల వాసు శుక్రవారం తెలిపారు. భవన అభివృద్ధికి రూ. 4 లక్షల మంజూరు చేసినట్లు తెలిపారు. సంబంధిత ప్రొసిడింగ్స్‌ను సంఘ నాయకులు నిమ్మల వెంకట నర్సయ్య, బొర్రగల్ల నారాయణ, శ్రీనివాస్, భూమయ్య, గంగాధర్, చంద్రగిరి శేఖర్, నిమ్మల నర్సయ్య, నిమ్మల గంగాధర్‌లకు తిరుమల వాసు అందించారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షికోత్సవం

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 23 : పట్టణంలోని శ్రీ లక్ష్మినరసింహస్వామి వార్షికోత్సవ కార్యక్రమాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని బోయవాడ కాలనీల్లో 29 సంవత్సరాల క్రితం నుంచి ఆలయ క్షేత్రం భక్తుల ఇలవేల్పుగా పేరుగాంచింది. ఆలయంలో ఏటా లోక కల్యాణార్థం నిర్వాహకులు ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా చేపడుతారు. శనివారం పౌర్ణమి సందర్భంగా ఆలయం 29వ వార్షికోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఈనెల 24న ఆలయంలో ఉదయం సుప్రభాతము, స్వామి వారికి అభిషేకాలు, ఊరేగింపు తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమై 26న స్వామి వారి కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టి 27న పూర్ణాహుతితో ముగింపు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వార్షికోత్సవాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లతో ఆలయాన్ని ముస్తాబు చేసినట్లు ఆలయ కమిటీ పేర్కొన్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

ప్రభుత్వ పథకాల అమలులో అలసత్వం ప్రదర్శించొద్దు

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలులో అలసత్వం ప్రదర్శించరాదని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సెప్టెంబర్ మాసం నుంచి డిసెంబర్ మాసం వరకు సంబంధించిన బ్యాంకు త్రైమాసిక అభివృద్ధి, సంక్షేమ సమీక్ష నిర్వహించారు. సంబంధిత బ్యాంకు, ఏజన్సీ సంస్థలతో పలు అంశాలపై కలెక్టర్ డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని బ్యాంకు అధికారులు రుణ లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో త్రైమాసికంలో వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ. 1,400 కోట్లు, వ్యవసాయ టర్మ్ రుణాలు రూ. 578 కోట్లు మంజూరు చేశామన్నారు. అదేవిధంగా వీధి వ్యాపారులకు సంబంధించి రెండవ విడతలో 5,683 మందికి రుణాలు ఇచ్చామన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా రుణాల కింద రూ. 330 కోట్లు, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద 192 మందికి రుణాలు అందించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వశక్తి సంఘాల సభ్యులకు రూ. 586 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో మహిళా సంఘాలకు రూ. 54.57 కోట్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ దివా కర, లీడ్ బ్యాంకు మేనేజర్ పొన్న వెంకట్ రెడ్డి, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండి యా రీజనల్ డిప్యూటీ హెడ్ సాయితేజ రెడ్డి, నాబార్డ్ డీడీఎం మనోహర్ రెడ్డి, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజినల్ హెడ్ రాం ప్రసాద్, డీఆర్‌డీవో సంపత్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీ నారాయణ, జిల్లా అధికారులు సాయిబాబా, కోట మధు సుదన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

● జిల్లా ఎక్సయిజ్ సూపరెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏనుగుల సత్య నారాయణ శుక్రవారం జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్‌భాషా, అదనపు కలెక్టర్ బీఎస్ లతలను కలిశారు. పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో వారిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కుల సంఘాల సంక్షేమానికి ఎంపీ నిధులు మంజూరు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 23 : కోరుట్ల నియోజక వర్గంలోని గ్రామాల్లోని కుల సంఘాల సంక్షేమానికి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ నిధులు మంజూరు చేసినట్లు కోరుట్ల బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని పట్టణాలతో పాటు నాలుగు మండలలోని గ్రామాల్లోని కుల సంఘాల సంక్షేమానికి సుమారు రూ. 70లక్షల నిధులను మంజూరు చేసారన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేస్తుందని, దేశంలో సబ్కా సాత్ సబ్కా వికాస్ సబ్కా విశ్వాస్ కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. దేశాభివృద్ధి కోసం మరోసారి ప్రధానిగా నరేంద్రమోడీకి మద్ధతు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధోనికేల నవీన్, బింగి వెంకటేష్, బాయ్ లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో జగిత్యాల విద్యార్థుల ప్రతిభ

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 23 : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో జగిత్యాల విద్యార్థులు సత్తా చాటారు. హైద్రాబాద్ లోని లాలాగూడ లో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగిన బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన అక్షయ్ సిల్వర్‌మెడల్, స్వరాలి పవిత్ర, సాయిమణి బ్రాంజ్‌మెడల్ సాధించారు. దుగ్యాల రాఘవ్, సాయిచరణ్‌లకు సర్టిఫికేట్‌లు లభించాయి. ప్రతిభచాటిన విద్యార్థులను జగిత్యాల బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి శ్రీనివాస్, సాగర్, అరుణ్, మహిపాల్, మహేష్ కోచ్ వంశీకృష్ణలు అభినందించారు.

ఫీడర్ చానల్ పనుల పరిశీలన

కథలాపూర్, ఫిబ్రవరి 23 : మండలంలోని భూషణరావుపేట, పెగ్గెర్ల గ్రామాల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఫీడర్ చానల్‌లో పూడిక తీత పనులను అడిషన్ డీఆర్‌డీవో మదన్‌మోహన్ పరిశీలించారు. అదేవిధంగా పెగ్గెర్ల, భూషణరావుపేట గ్రామాల్లో కొనసాగుతున్న నర్సరీ పనులను పర్యవేక్షించారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రతీ కూలీ వంద రోజుల పనిదినాలు పూర్తి చేసేలా చూడాలని సూచించారు. ఈ మార్చిలోపు సెల్ఫ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి గఫూర్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 23 : గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడ జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని రాజేశ్వరరావుపేటలో ఎంజీఎన్ ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కోనరావుపేటలో నూతనంగా నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డును పరిశీలించారు. నిధులు మంజూరు చేయించిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావులకు ఆయా గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాలకు వచ్చిన కృష్ణారావును శాలువాలతో నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులతో కలిసి ఆయా శాఖల ద్వారా మరిన్ని నిధులు తీసుకొస్తానని పేర్కొన్నారు. అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం చేయకుండా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని పలు సూచనలు చేశారు. ఆరుగ్యారెంటీల్లోని గృహజ్యోతి, రూ. 500లకు గ్యాస్ సిలిండర్ అందజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని, ప్రజల పక్షాన ఉండేది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు.



రాజేశ్వరరావుపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కృష్ణారావు

ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మారు సాయిరెడ్డి, జక్కని పరంధాం, రవి, స్వామి శ్రీధర్, లక్ష్మణ్, రాహుల్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కథలాపూర్ : మండలంలోని పలు గ్రామాలకు 59 చెక్కులు మంజూరయినట్టు తహసీల్దార్ ముంతాజీబోద్దీన్ తెలిపారు. మంజూరైన చెక్కులను లబ్దిదారులకు తమ శాఖ అధికారులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తా రని చెప్పారు.

● మండల కేంద్రంలోని ఇంటర్మీడీయేట్ పరీక్షలకు 626 మంది విద్యార్థులు హాజరవుతారని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ గౌసుర్‌రహమాన్ తెలిపారు. ప్రథమ సంవత్సరంకు సంబంధించి 330 మంది, ద్వితీయ సంవత్సరంలో 296 మంది పరీక్షలకు హాజరుకానున్నట్టు చెప్పారు. ఈ నెల 28 నుంచి మార్చి 14 దాకా పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని చెప్పారు.

● ప్రస్తుత వేసవి సీజన్‌లో ఉపాధి హామి పనులను వేగవంతంగా చేపట్టడానికి సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో శంకర్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని 19 గ్రామాల్లో శుక్రవారం 1045 మంది కూలీలకు పనులకు హాజరయ్యారని సగటున ఒక్కో గ్రామంలో 55 మంది కూలీలు పనులకు వచ్చారని తెలిపారు.

● నువ్వుల సాగుకు రైతాంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో నువ్వు విత్తనాల కోసం రైతాంగం ఎదురుచూస్తోంది. మండలంలోని రైతులు ఫిబ్రవరిలో నువ్వు విత్తనాల సాగుకు ఉపక్రమిస్తుంటారు. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నప్పటికీ నేటికీ వ్యవసాయాధికారులకు ఎలాంటి సమాచారం అందకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. రెండు సంవత్సరాల కిందట అప్పటి ప్రభుత్వం నాలుగు కిలోల సంచిని సబ్సిడీతో సరఫరా చేసింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో నువ్వు సాగు చేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తుందనే ఆశలతో ఉన్నారు. మరో వైపు విత్తనాల సాగుకు సమయం మించి పోతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

వెల్గటూర్: మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో అధికారులకు సూచించారు. మండల వైద్యాధికారుల ఆధ్వర్యంలో మండల లెవల్ మీటింగ్ నిర్వహించారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

రాయికల్, ఫిబ్రవరి 23: నూతనంగా బదిలీపై వచ్చిన మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌ను శుక్రవారం ధర్మసమాజ్ పార్టీ నాయకులు సన్మానించారు. రాయికల్ పట్టణంలో సమస్యలను తమ దృష్టికి వస్తే పరిష్కరించమని కోరారు. దానికి సానుకూలంగా స్పందించి తప్పకుండా మాదృష్టికి వస్తే పరిష్కరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాయికల్ మండల అధ్యక్షుడు జీవన్, అష్రఫ్, స్వామి, రాము, ప్రణయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఎడ్ల బండ్ల పోటీలు

పెగడపల్లి: పెగడపల్లి మండలంలోని లింగాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన ఎడ్ల బండ్ల పోటీలు ఉల్లాసంగా సాగాయి. లింగాపూర్‌లో శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలలో బాగంగా శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. పోటీలలో పొట్లపల్లి సాగర్ అచ్చులాపూర్ మొదటి బహుమతి, తూముల వెంకటరామయ్య పాత మంచిర్యాల రెండ బహుమతి, పెంచాల లక్ష్మణ్ పొన్నారం తృతీయ బహుమతులు అందుకన్నారు. ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.